క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు జరుగుతుందని ఆయన తెలియజేశారు. 9959225430 నంబర్‌కు సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాల్సిందిగా ఆయన కోరారు.

స్ఫూర్తి నైనాకు గోల్డ్ మెడల్



కారెంపూడి: పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన గిరిజన బాలిక చదల స్ఫూర్తి నైనా మరో సారి అండర్‌-11 బాలికల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్టేట్ నంబర్ వన్‌గా నిలిచింది. విశాఖపట్నంలో ఆదివారం రాత్రి ముగిసిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో నైనా స్టేట్ నంబర్ వన్ ర్యాంకింగ్ సాధించి బంగారు పతకం కైవశం చేసుకుంది. నాలుగో సారి విశాఖపట్నం టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించింది. వరసగా నాలుగు విజయాలతో స్ఫూర్తి సరికొత్త రికార్డు సాధించింది. స్ఫూర్తి స్థానిక ప్రైవేటు స్కూల్లో ఆరో తరగతి చదువుతోంది. ప్రైవేటు స్కూల్లో పీఈటీగా పని చేస్తున్న తండ్రి ఏసుబాబు శిక్షణలో వరుస విజయాలు సాధిస్తోంది.

దీనదయాళ్ ఉపాధ్యాయ యువతకు ఆదర్శం

అచ్చంపేట: పండిట్ దీనదయాళ్ జయంతిని సోమవారం అచ్చంపేటలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తమ్మా వెంగళరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి పడకండ్ల లక్ష్మాచారి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దుబ్బా సత్యనారాయణ, ఓబీసీ మండల అధ్యక్షుడు దుబ్బా సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు మోదెల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం శ్రీనివాస్‌కు అలైఖ్య ఐకాన్ అవార్డు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డికి అలైఖ్య ఐకాన్ అవార్డు -2023ని శ్రీసాయి అలైఖ్య సాంస్కృతిక సేవా సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రదానం చేసింది. విద్యా రంగంలో 27ఏళ్లుగా శ్రీనివాసరెడ్డి కృషి చేసినందుకు ఈ పురస్కారం అందజేసినట్లు నిర్వాహకుడు అరుణ అశోక్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అతిథులుగా టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, దైవజ్ఞ శర్మ, విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్, బలగం సినీ నటుడు కొరమయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు తిరుమలేష్, శ్రీనివాసరెడ్డి, ఉన్నత విద్యావేత్త శివరామయ్య మంగళవారం అభినందించారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి



క్రోసూరు: క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లో గల కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు వద్ద టిప్పర్ లారీ ఢీకొని విద్యార్థి అంబటి రామకృష్ణ(21) అక్కడిక్కడే మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. అచ్చంపేట మండలం మిట్టపాలేనికి రామకృష్ణ స్నేహితులతో కలిసి వినాయకుడికి గజమాల కోసం క్రోసూరుకు వచ్చాడు. ఈ క్రమంలో బ్యాంకు ఏటీఎంలోకి వెళ్లి తిరిగి.. తన ద్విచక్ర వాహన్ని వెనక్కు తీస్తుండగా.. అదే సమయంలో అటుగా వేగంగా వస్తున్న టిప్పర్ లారీ వెనుక టైరు తగలటంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సత్తెనపల్లి కృష్ణవేణి కాలేజీలో డిగ్రీ చదువుతున్నట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. ఎస్ఐ పాల్‌రవీందర్ విచారణ జరుపుతున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఘనంగా కొనసాగుతున్న వినాయక ఉత్సవాలు

పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు



వినాయక విగ్రహం వద్ద పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పీఆర్కే



ప్రత్యేక అలంకరణలో వినాయక విగ్రహం

మాచర్ల: పట్టణంలోని పార్కుసెంటర్ సమీపంలో వేంచేసియున్న కోదండరామాలయంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించి వర్షాలు బాగా కురిసి విఘ్నాలు తొలగాలని వేడుకున్నారు. కమిటీ సభ్యులు ప్రతి ఏడాది స్వామి వారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించటం అభినందనీయమన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కోదండరామాలయ ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 3వేల మందికి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని చర్చి బజారులో మైసమ్మ దేవాలయ ప్రాంతంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం సంఘం ఆధ్వర్యంలో వినాయకునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంఘ పెద్దలు వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పలు వినాయకుని విగ్రహాల వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని జరిగాయి. అదే విధంగా విగ్రహానికి పట్టణంలో భారీ స్థాయిలో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జై జై గణేశ అంటూ మహిళలు, భక్తులు గులాంలు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ నాగార్జున సాగర్ కుడికాలువకు నిమజ్జనానికి తరలించారు.

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుకభాగంలో కృష్ణవేణి స్కూల్ ప్రాంతంలో వేముల దుర్గ, మాజీ కౌన్సిలర్ కళ్యాణి, వెంకట్రావుతో పాటు పలువురు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం 1500 మందికి అన్నదానం చేశారు.



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

పాత మాచర్లలో..

పాత మాచర్లలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఓరుగంటి పురుషోత్తం, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఓరుగంటి చెన్నకేశవరావు తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి అన్నదానం నిర్వహించారు.

డాన్సు పోటీల నిర్వహణ



గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తున్న సభ్యులు

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డాన్సు బేబి డాన్సు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగంటి పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంపొందించేందుకు డాన్సు బేబి డాన్సు, డిబేటు, వ్యాసరచన, సంగీతం, ఆటలు తదితర పోటీలతో ప్రజల్లో ఉత్సాహం నింపేందుకు కృషి చేసినట్లు తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకొని పోటీలలో ఉత్సాహంగా పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దత్తు, హరి, శివ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రామారావు, ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులున్నారు.

రెజ్లింగ్ పోటీలలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



పోటీలలో గెలుపొందిన, పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మేరి మంజుల, ఉపాధ్యాయినులు

విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యార్థినులు కృష్ణా జిల్లాలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో తమ ప్రతిభను చాటినట్లు ప్రిన్సిపాల్ మేరి మంజుల సోమవారం తెలిపారు. అండర్-17లో 49 కేజీల విభాగంలో పి.జ్యోతి, 53 కేజీల విభాగంలో ఆర్.అనూష కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ మేరి మంజుల, వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయినులు చెంచులక్ష్మి, పుష్పలత, వాణి రాణి, మహబూబీ, నసీమ అభినందించారు.

అర్హులందరికీ ఓటు హక్కే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ షేక్ మహమ్మద్ హుస్సేన్, కమిషనర్ రమణబాబు

మాచర్ల రూరల్: ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై బూత్ లెవల్ అధికారులు చేపడుతున్న సర్వేకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి షేక్ మహమ్మద్ హుస్సేన్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం తాము పనిచేస్తున్నామని, బీఎల్ఓలకు అందరూ తగు సమాచారాన్ని అందించి జాబితాను రూపొందించటంలో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, తహసీల్దార్లు రమేష్‌కుమార్, శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ కుర్రా వెంకటేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి బాబురావు, టీడీపీ, బీజేపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద పిచ్చి మొక్కలు తొలగిస్తున్న గ్రామ ప్రజా ప్రతినిధులు

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల, చింతపల్లి గ్రామాలలో స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాలను సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది సోమవారం నిర్వహించారు. పెదకొదమగుండ్ల గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసే పనుల్లో గ్రామ సర్పంచ్ మాదాసు వెంకటరమణ శ్రీనివాసరావు, ఎస్బీఎం మండల కో ఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. తర్వాత చింతపల్లి గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీని గ్రామ సర్పంచ్ ఉన్నం రామాంజమ్మ, ఎంపీటీసీ వేంపోగు నిర్మల అచ్యుతరావులు పరిశీలించారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయంలో పక్షోత్సవాలను ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. దాని సాధన కోసం గ్రామ పంచాయతీల పాలక వర్గాలకు ఆయా గ్రామాల ప్రజలు చేయూతనిచ్చి సహకరించాల్సిన అవసరాన్ని ఎంపీపీ శారద వివరించారు.

పరిశుభ్రతపై అవగాహన

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో స్వచ్ఛతయే సేవా కార్యక్రమం సోమవారం జరిగింది. ఎస్బీఎం మండల సమన్వయకర్త ఎం.బ్రహ్మానందం పాల్గొని పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పీలా లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో వ్యాధిగ్రస్తుల గుర్తింపు



ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



కంచరగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న సీహెచ్ఓ శాలిని

మాచర్ల రూరల్: అందరికీ ఆరోగ్య రక్షణ కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నాడు-నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రులను అభివృద్ధి చేసి వైద్యశాఖలోని ఖాళీల నియామకాలు చేపట్టి ఆసుపత్రులను ఆధునీకరించి అన్ని వసతులు కల్పించింది. ప్రతి ఇంటి సర్వే చేపట్టి రోగులను గుర్తించే కార్యక్రమంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు, లచ్చంబావి, అచ్చమ్మకుంట, మారుమూల తండాలలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు. షుగర్, బీపీ, తదితర రక్త పరీక్షలు చేస్తున్నారు. రోగులను గుర్తించి మండల కేంద్రంలో ఆరోగ్య వైద్య శిబిరాల ద్వారా వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో పాల్గొనాలి

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఆరోగ్య భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు వహించాలని ముటుకూరు-2 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శాలిని అన్నారు. సోమవారం ముటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కంచరగుంట మంగాపురం తండా గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. మండల పరిధిలోని దుర్గి, అడిగొప్పల పీహెచ్‌సీ సెంటర్ పరిధిలోని పలు గ్రామాలలో ముమ్మరంగా సర్వే చేపట్టారు. సర్వేలో స్థానిక ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశ వర్కర్లు బృందంగా ఏర్పడి ప్రతి ఇంటికీ వెళ్ళి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. త్వరలో వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసి వైద్య సలహాలు సూచనలు అందజేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు.

మారుమూల గ్రామాలలో సైతం ఆరోగ్య పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మారుమూల పల్లెల్లో సైతం సిబ్బంది వైద్య పరీక్షలు జరుపుతున్నాం. ఇంటింటి సర్వే ద్వారా రోగులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు వైఎస్సార్ ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాం.

డాక్టర్ శివలీల, పీహెచ్‌సీ వైద్యురాలు, తాళ్ళపల్లి

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



వైద్య పరీక్షలు చేస్తున్న విజయవాడ ప్రవీణ్ హాస్పిటల్ డాక్టర్ ఎండీ కార్డియాలజీ విశ్వనాథ్

సత్రశాల(రెంటచింతల): స్థానిక ఏపీ జెన్‌కో నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులకు విజయవాడకు చెందిన ప్రవీణ్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీ జెన్‌కో వైద్యాధికారి ఎస్.మధుసూదనబాబు అన్నారు. సోమవారం ఏపీ జెన్‌కో యూనిట్‌లో భవ్యహెల్త్ సర్వీసెస్ విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ప్రవీణ్ హాస్పిటల్ డాక్టర్ ఎండీ కార్డియాలజీ విశ్వనాథ్, టెక్నీషియన్ కె.రమేష్ మొత్తం 150 మందికి వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా చిన్న ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈలు నాగరాజు, గిరిబాబు, ఏఈఈ జైపాల్, శారద, టెక్నీషియన్ లక్ష్మీకాంత్, నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పల్నాటి వీర చరిత్ర.. మరో మహాభారతం



ప్రముఖ శిల్పి చెన్నుపాటిని సత్కరిస్తున్న సినీ గేయ రచయిత జొన్నవిత్తుల

దుర్గి: పల్నాటి వీరచరిత్ర మహాభారతాన్ని తలపిస్తుందని ప్రముఖ సినీ గేయ రచయిత భువన చంద్ర అన్నారు. ప్రముఖ వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు రచించిన పల్నాటి శతకం పుస్తకాన్ని ప్రముఖ శిల్పి, దుర్గి నాగార్జున శిల్పశాల నిర్వాహకులు చెన్నుపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. గుంటూరులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నుపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ దుర్గిలో శిల్పకళా నైపుణ్యానికి అంతర్జాతీయంగా గుర్తింపు రావటానికి కారకులైన ఎన్ఆర్ఐ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నేటి కంప్యూటర్ యుగంలో చేతివృత్తులను మరచిపోకుండా వాటి అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కొన్ని నెలల క్రితం విశాఖపట్నంలో నిర్వహించిన గ్రేట్ సమ్మిట్‌లో తాము తయారు చేసిన అనేక శిల్పాలను ప్రదర్శించటంతో జాతీయంగా, అంతర్జాతీయంగా తమ కళకు గుర్తింపుతో పాటు అనేక మందికి ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తు చేశారు. వక్తలు పల్నాటి శతకం పుస్తకం మరో మహాభారతాన్ని గుర్తు చేస్తుందని ప్రశంసించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు చెన్నుపాటికి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

సత్తెనపల్లి: కవి కోకిల గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 9, 10వ తరగతి విద్యార్థులకు గబ్బిలం - యితివృత్తం - జాషువా దృక్పథం అనే అంశం మీద, సీనియర్ విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాషువా పద్యాలు - విశిష్టత అనే అంశం మీద వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 155 మంది విద్యార్థులు పాల్గొన్నారని, విశేష స్పందన లభించిందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు యిర్మీయా, సురేష్ బాబు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ నెల 28న జాషువా 128వ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ సభ్యుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడాది మొత్తం ఉపాధి పనులు కల్పించాలి

నకరికల్లు: రైతులకు వ్యవసాయ పనులు లేనందున ఏడాది మొత్తం ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపి, తహసీల్దారు కె.నగేష్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ వర్షాభావం నేపథ్యంలో మండలంలో సుమారు 70 శాతం మంది రైతుల పొలాలు బీళ్లుగా మారాయన్నారు. నకరికల్లును కరువు మండలంగా ప్రకటించి, రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఈవూరి అప్పిరెడ్డి, ఈవూరి లక్ష్మారెడ్డి, జి.వెంకటరమణ, ఎస్. రామాంజనేయులు నాయక్, గుంజా ఏడుకొండలు, షేక్ లాలూ, అవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

రాజుపాలెం: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. చౌటపాపాయపాలెంలో కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలు జరుగుతున్న తీరును సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామంలోని పలు గృహాలను సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని తెలిపారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌ను పరిశీలించారు. రక్త పరీక్షల రిపోర్టులను తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ వెంకటకృష్ణకుమార్, డాక్టర్ రవితేజనాయక్, సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అందచేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలలో, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని ఎంపీపీ పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతస్థానానికి చేరుకుంటారన్నారు. ప్రతి విద్యార్థి మహనీయులు జీవిత చరిత్రలను తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడిచి తల్లిదండ్రులకు, గ్రామాలకు గుర్తింపు తీసుకురావాలని అప్పుడే మీ జీవితం సార్థకమౌతుందన్నారు. తరగతి గదులలో బోధించే పాఠాలను ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మౌలిక వసతులను కల్పించి వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు మెను ప్రకారం తప్పనిసరిగా విద్యార్థులకు మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులలో దాగిన ప్రతిభ గుర్తించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థులు



రెజ్లింగ్‌లో ప్రతిభకనబరచిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమార్

అచ్చంపేట: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ జట్టుకు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం ప్రిన్సిపాల్ టి.అరుణ కుమార్ తెలిపారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా నున్న జెడ్పీ హైస్కూలులో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్ విద్యార్థి కె.కార్తికేయ, జూనియర్ ఇంటర్ విద్యార్థి డి.కళ్యాణ్ విశేషకనబరచి బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. బి.ఓబేదు, జి.రాజు, ఎం.శివాజీ, పి.చంటి రజత పథకాలు, బి.సంతోష్, డి.కుమార్‌బాబు, ఎం.జాయ్ కాంస్య పథకాలను సాధించినట్లు వివరించారు. బంగారు పతకాలు సాధించిన కార్తికేయ, డి.కళ్యాణ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన పీడీ జి.భూషణాన్ని ప్రిన్సిపాల్, కళాశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ జి.బ్రహ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమారు పాల్గొన్నారు.